# రాజభక్తి

(గల్పిక)

గంగదేశంమీద మంగదేశం యుద్ధం ప్రకటించింది. గంగదేశపు పౌరులు రాజభక్తిగలవాళ్ళు. అందుచేత వాళ్ళు వీరోచితంగా యుద్ధం చెయ్యటానికి నడుములు కట్టారు.

అదీగాక మంగదేశపు రాజు మ్లేచ్ఛుడు. మంగ పౌరులలో తొంభై శాతం మ్లేచ్ఛమతం పుచ్చుకున్నవారే. గంగప్రజల వీరౌచిత్యానికి అదొక ప్రధాన కారణమయింది.

చిత్రం ఏమిటంటే ఒకప్పుడు మంగరాజూ, గంగరాజూ భాయి-భాయిగా ఉండేవాళ్ళు. ఆ ఇద్దరి మతౌదార్యం గురించి కవులు కవిత్వం కూడా చెప్పారు.

కాని ఇప్పుడు గంగదేశంలో మ్లేచ్ఛ మత వ్యతిరేక ప్రచారమూ, మంగదేశంలో హిందూమత వ్యతిరేక ప్రచారమూ ముమ్మరంగా సాగాయి. యుద్ధకారణం ఉభయదేశాల ప్రజలకూ తెలీదు.

యుద్ధం జరిగింది. అటూ ఇటూ నాలుగేసి వేల సైనికులు చచ్చారు.

"ఓడాం ! ఓడాం !" అన్నాడు గంగరాజు.

"గెలిచాం ! గెలిచాం !" అన్నాడు మంగనవాబు

సంధి. ఇద్దరు రాజులూ ఒక డేరాలో చేరారు విందు జరిగింది. సారా, రక్తానికి బదులుగా, ఏరులై పారింది. డేరా బయట ఉన్న కాపలావాళ్ళకి గంగరాజు బొంగురు నవ్వులూ, నవాబుగారి కీచునవ్వులూ వినిపించాయి.

సంధి షరతు : నవాబుగారి కొడుక్కు-గంగరాజుగారి ఏకపుత్రికను - ఏక సంతానాన్ని - ఇచ్చి పెళ్ళి చెయ్యటం.

తిరిగి మతసామరస్య ప్రచారం అయింది. రాజభక్తిని ప్రజలు గంగరాజు గారి అల్లుడి - కాబోయే గంగనవాబుగారి-పట్లకూడా చూపారు.

* * *

"ఏవండీ, ఈ యుద్ధం ఎందుకు జరిగినట్టు ?" అని మహామాత్యులవారి భార్య అడిగింది.

"యుద్ధంలో ఓడకుండా గంగరాజకుమార్తెను నవాబు కొడుక్కు-ఇస్తామంటే లోకం ఆక్షేపించదుటే, పిచ్చిదానా ? యుద్ధం జరగాలి. కొంత మంది చావాలి. మనం ఓడి సంధి చేసుకోవాలి. సంధి షరతుకింద ఈ పెళ్ళి జరగాలి. ఇదంతా మన ఏర్పాటేలే !" అంటూ మహామాత్యులవారు మీసం దువ్వారు.

కొడవటిగంటి కుటుంబరావు

# రాజకీయ చతూర్వారం

(గల్పిక)

ప్రాచీన దిబ్బ పత్రాలు తిరగేస్తుంటే ఈ వింత విషయం నాకు తెలియ వచ్చింది.

దిబ్బ ఒకప్పుడు లోహపరిశ్రమకూ, లోహకారులకూ ప్రసిద్ధి. దిబ్బ సైనికుల శౌర్యపరాక్రమాల మాట మనకు తెలీదుగాని, దిబ్బ ఆయుధాలంటే చుట్టు ప్రక్కల రాజ్యాలకు హడలుగా ఉండేది.

అయితే దిబ్బలో చందనంలేదు. దాన్ని దిబ్బకు తిరుగుండం అమ్మేది. దిబ్బకూ, తిరుగుండానికీ అనాదిగా వైరం ఉన్నప్పటికీ, ఉభయదేశాలూ వర్తక సంబంధాలు కలిగి ఉండేవి.

ఇలా ఉండగా తిరుగుండం రాజు ఒకసారి అకస్మాత్తుగా దిబ్బకు చందనం ఎగుమతి నిషేధించాడు. దిబ్బలో పదిహేను కుటుంబాలకు చందనం లేకుండా జరగదు. అందుచేత చందనంకోసం రాయబారాలూ, సంప్రదింపులూ, సమావేశాలూ జరిగాయి.

"మాకు మీరు ఖడ్గాలూ, ఈటెలూ, బరిసెలూ, బాణపు ములుకులూ మొదలైనవి భారీఎత్తున మారకం వేసేటట్టయితే చందనం ఇస్తాం", అన్నాడు తిరుగుండం రాజు.

అందుకు దిబ్బరాజూ, దిబ్బమంత్రులూ ఒప్పుకున్నారు. లోహకారులు అహోరాత్రాలు పనిచేసి తిరుగుండానికి కావలసిన ఆయుధసామగ్రి అందించారు. దిబ్బసైన్యానికి కావలసిన ఆయుధాలు తయారుచేసే వ్యవధికూడా వారికి లేకపోయింది.

ఆ సంవత్సరమే మొట్టమొదటిసారిగా దిబ్బరాజ్యం తిరుగుండం చేతిలో ఓడిపోయి, చావుదెబ్బ తిన్నది. అది తిరిగి కోలుకోవటానికి ఇరవై ఏళ్ళు పట్టిందిట.

---

**కొడవటిగంటి కుటుంబరావు**